**8వ అధ్యాయం**

# ٨ - بَابُ الاِستِقَامَةِ

# నిలకడ, స్థైర్యము

## ٨ - بَابُ الاِستِقَامَةِ

قال الله تعالى: ﴿ فَاسْتَقِمْ كَمَآ أُمِرْتَ ﴾ [هود: ١١٢]، وقال تعالى: ﴿ إِنَّ ٱلَّذِينَ قَالُوا۟ رَبُّنَا ٱللَّهُ ثُمَّ ٱسْتَقَـٰمُوا۟ تَتَنَزَّلُ عَلَيْهِمُ ٱلْمَلَـٰٓئِكَةُ أَلَّا تَخَافُوا۟ وَلَا تَحْزَنُوا۟ وَأَبْشِرُوا۟ بِٱلْجَنَّةِ ٱلَّتِى كُنتُمْ تُوعَدُونَ ﴿٣٠﴾ نَحْنُ أَوْلِيَآؤُكُمْ فِى ٱلْحَيَوٰةِ ٱلدُّنْيَا وَفِى ٱلْـَٔاخِرَةِ ۖ وَلَكُمْ فِيهَا مَا تَشْتَهِىٓ أَنفُسُكُمْ وَلَكُمْ فِيهَا مَا تَدَّعُونَ ﴿٣١﴾ نُزُلًا مِّنْ غَفُورٍ رَّحِيمٍ ﴿٣٢﴾ ﴾ [فصلت: ٣٠، ٣٢]، وقال تعالى: ﴿ إِنَّ ٱلَّذِينَ قَالُوا۟ رَبُّنَا ٱللَّهُ ثُمَّ ٱسْتَقَـٰمُوا۟ فَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿١٣﴾ أُو۟لَـٰٓئِكَ أَصْحَـٰبُ ٱلْجَنَّةِ خَـٰلِدِينَ فِيهَا جَزَآءًۢ بِمَا كَانُوا۟ يَعْمَلُونَ ﴿١٤﴾ ﴾ [الأحقاف: ١٣، ١٤].

అల్లాహ్ సెలవిచ్చాడు : "ఓ ప్రవక్తా! నీవూ, (అవిశ్వాసం, తిరుగుబాటుల నుండి విశ్వాసం, విధేయతల వైపుకు) మరలివచ్చిన నీ సహచరులూ నీకు ఆజ్ఞాపించిన విధంగా ఋజు మార్గంపై స్థిరంగా ఉండండి." (హూద్ : 112)

మరొకచోట అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "అల్లాహ్‌యే మా ప్రభువు అని పలికి ఆ మాట మీదనే స్థిరంగా నిలబడే వారి కోసం దైవ దూతలు అవతరించి, "భయపడకండి, బాధ పడకండి, మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం అనే శుభవార్తను విని ఆనందించండి. మేము ఈ ప్రాపంచిక జీవితంలో కూడ మీకు సహచరులుగా ఉంటాము, పరలోకంలో కూడ. అక్కడ మీరు కోరినదల్లా మీకు లభిస్తుంది. మీరు ఆశించే ప్రతివస్తువూ మీదవుతుంది. ఇవీ మీకు లభించే ఆతిథ్యపు ఏర్పాట్లు, క్షమాశీలుడూ, కరుణామయుడూ అయిన దేవుని వైపు నుండి" అని అంటారు.
(హామీమ్ అస్ సజ్‌దహ్ : 30 - 32)

ఇంకొకచోట ఇలా సెలవీయబడింది : "నిశ్చయంగా అల్లాహ్‌యే మా ప్రభువు అని ప్రకటించి, దానిపై స్థిరంగా ఉండిపోయిన వారికి ఏ భయమూ లేదు, వారు దుఃఖించడమూ జరగదు. అలాంటి వారే స్వర్గానికి పోయేవారు. అక్కడనే వారు శాశ్వతంగా ఉంటారు. ప్రపంచంలో తాము చేసిన పనులకు ప్రతిఫలంగా."
(అల్ అహ్‌ఖాఫ్ : 13-14)

٨٥ ـ وَعَنْ أَبِي عَمْرٍو، وقيل: أبي عَمْرَةَ سُفْيَانَ بنِ عبدِ الله رضي الله عنه قال: قُلْتُ: يَا رسول الله قُلْ لِي في الإسْلامِ قَوْلًا لا أَسْأَلُ عَنه أَحداً غَيْرَكَ. قال: «قُلْ: آمَنْتُ باللهِ؛ ثُمَّ اسْتَقِمْ» رواه مسلم.

85. హజ్రత్ అబూ అమ్ర్ (కొందరి అభిప్రాయం ప్రకారం అబూ అమ్ర్ సుఫ్యాన్ బిన్ అబ్దుల్లాహ్ - రజి) కథనం: నేను దైవప్రవక్తను "నాకు ఇస్లాం గురించి ఏమైనా బోధించండి. (అయితే) దాని గురించి నేను మిమ్మల్ని తప్ప వేరొకళ్ళని అడగవలసిన అవసరం రాకూడదు" అని అడిగాను. దానికి ఆయన "నేను అల్లాహ్‌ను నమ్ముతున్నాను అని చెప్పు. తరువాత ఆ మాటపైనే నిలకడగా ఉండు" అని ఉపదేశించారు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని విశ్వాసాల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

స్థయిర్యాన్ని, (ఇస్తిఖామత్‌ను) ప్రదర్శించడమంటే ఇస్లాం ధర్మంలోని నిషేధాలను అమలుపరచడంలో నిలకడగా ఉండటం. దైవాజ్ఞల్ని, విధులను, దైవప్రవక్త సంప్రదాయాలను, పుణ్యకార్యాలను నిర్వర్తించడంతో పాటు దేవుని నిషేధాజ్ఞలకు, వారింపులకు దూరంగా ఉండటాన్నే 'ఇస్తిఖామత్' అంటారు. ఒట్టి నోటిమాటలను విశ్వాసం (ఈమాన్)గా పరిగణించడం జరగదు. విశ్వాసంతోపాటు ఆచరణ ఉంటేనే అది నిజమైన విశ్వాసంగా భావించబడుతుంది. ఎందుకంటే ఆచరణే విశ్వాసానికి ఫలితం. పండ్లు కాయని చెట్టు నిష్ప్రయోజనకరమైనట్లే ఆచరణ లేని విశ్వాసం (ఈమాన్) నిరర్థకం అవుతుంది.

٨٦ ـ وَعَنْ أبي هُرَيْرَةَ رضي الله عنه قال: قال رسولُ الله ﷺ: «قَارِبُوا وَسَدِّدُوا، واعْلَمُوا أنَّهُ لَنْ يَنْجُوَ أَحَدٌ مِنْكُمْ بعَمَلِهِ»، قَالُوا: ولا أنْتَ يَا رسولَ الله؟ قَالَ: «ولا أَنَا إلَّا أنْ يَتَغَمَّدَنِي اللهُ بِرَحْمَةٍ مِنْهُ وَفَضْلٍ» رواه مسلم.

86. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: మధ్యేమార్గాన్ని అనుసరించండి. (వ్యవహారాల్లో నిలకడగా) ఖచ్చితంగా ఉండండి. మీలో ఎవరూ (కేవలం) తమ ఆచరణ ఆధారంగానే ముక్తిపొందలేరని తెలుసుకోండి!"

وَ«المُقَارَبَةُ»: القَصْدُ الَّذِي لا غُلُوَّ فِيهِ وِلا تَقْصِيرَ. وَ«السَّدَادُ»: الاسْتِقَامَةُ وَالإِصَابَةُ، وَ«يَتَغَمَّدَنِي»: يُلْبِسُنِي وَيَسْتُرُنِي.

قَالَ العُلَمَاءُ: مَعْنَى الاسْتِقَامَةِ: لُزوم طَاعَةِ الله تَعَالَى؛ قَالُوا: وَهِيَ مِنْ جَوَامِعِ الْكَلِم، وَهِيَ نِظَامُ الأُمُورِ، وبِالله التَّوفيق.

అందుకు సహచరులు "దైవప్రవక్తా! మీరు కూడానా?" అని సందేహపడగా, దానికి ఆయన "అవును, నేను కూడా (కేవలం నా ఆచరణ ఆధారంగా ముక్తి పొందలేను) అల్లాహ్ నన్ను తన కరుణా కటాక్షాలతో ముంచివేస్తే తప్ప" అని బదులిచ్చారు. (ముస్లిం)

'ముఖారబ' అంటే మధ్యేమార్గం. అతి వాదానికి, మరీ మితవాదానికి మధ్య ఉండేమార్గం. 'అస్సదాద్' అంటే నిలకడ, సూటిదనం. 'యతగమ్మదనీ' అంటే 'నన్ను తొడుక్కుంటే' లేక 'నన్ను కప్పుకుంటే' అని అర్థం.

విద్వాంసులు ఇలా అభిప్రాయపడ్డారు: స్థయిర్యం (ఇస్తిఖామత్) అంటే సదా దైవవిధేయతకు కట్టుబడి ఉండటం. ఇంకా పండితులు ఇలా అన్నారు : ఈ హదీసు వాక్యాలు 'జవామివుల్ కలిమ్' (సమగ్రమైన వచనాల)లోనివి. (అంటే పదాలు క్లుప్తంగా, భావగర్భితంగా ఉంటాయి.) అంతేకాదు, ఈ హదీసు వ్యవహార సరళిని సూచిస్తోంది. వబిల్లాహిత్తౌఫీఖ్.

*(సహీహ్ ముస్లింలోని 'కపటుల' ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

విశ్వాసం (ఈమాన్)తో పాటు ఆచరణకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉందన్నమాట వాస్తవమే! కాని కేవలం తాము చేసుకున్న సత్కర్మలు, సదాచరణలతోనే ముక్తి లభిస్తుందనీ,

దాని ఆధారంగానే స్వర్గంలోకి ప్రవేశించగలమని భావించడం కూడా సరికాదు. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో ఆచరణలోని లోపాలవల్ల మన ఆచరణ దైవసన్నిధిలో స్వీకార భాగ్యాన్ని పొందలేకపోవచ్చు. అప్పుడు అలాంటి ఆచరణ వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. కాబట్టి మనిషి ఒక వైపు సదాచరణ చేస్తూనే మరోవైపు దైవ సన్నిధిలో తన ఆచరణ స్వీకృతిని పొందాలని, దేవుడు తన్ను తన కారుణ్య ఛాయల్లోకి తీసుకోవాలని, తను చేసే ప్రతి మంచిపనిలోనూ చిత్తశుద్ధిని ప్రసాదించాలని కోరుకుంటూ ఉండాలి. అయితే దైవప్రసన్నతను బడయటానికి ఏకైక మార్గం కూడా సదాచరణేనన్న సంగతిని మరువకూడదు సుమా!